
# వెలుగు లేని చోటు...



చంద్ర

అక్కడి మేడలన్నీ కూడబలుక్కున్నట్టుగా సూర్యుణ్ని మింగేసినప్పుడు ఆ వీధిలో చీకటి మాటేసింది. అంతవరకూ మేడకి మేడకీ మధ్యని చారలుగా కనిపించిన వెలుతురు ముక్కలు మాయమయినయి. ఇప్పుడా వెలుతురుముక్కలు మేడల తాలూకు కిటికీల్లోంచి దేదీప్యంగా కనిపిస్తున్నాయి.

అరిచ్చెందురుడు యిప్పుడావీధిలో వెలగని వీధి దీపంకింద కూచున్నాడు.

అసలు ఆ వీధిలో ఎక్కువమంది డబ్బులో వెలుగుతున్నవాళ్ళే. అయినా అక్కడిజనం- మా యిళ్ళల్లో డబ్బు ఎక్కువగా వుందీ, దొంగలభయం ఎక్కువా, అందువల్ల మా వీధికి స్ట్రీటులైట్లుండాలీ- అని మున్సిపాలిటీ ఆఫీసరుకు ఓ స్కాచి పార్టీ యిచ్చి పదిహేనడుగుల రోడ్డు కిరుప్రక్కలా ట్యూబులైట్ల పహారాని పెట్టించేరు. ఆ సందు మొదట్లో గుడికట్టే ప్రయత్నంలో అక్కడి కరెంటు స్థంభాన్ని కదిలించడంవల్ల గత నాల్రోజులుగా ఆ వీద్దీపాలు వెలగటంలేదు.

అందువల్ల అరిచ్చెందురుడికి మేడల కిటికీల్లోతప్ప యింకెక్కడా వెలుగు కక్కని

పించడంలేదు.

అరిచ్చెందురుడు పుట్టింది చీకట్లో-

అరిచ్చెందురుడి తల్లి పుట్టింది చీకట్లో-

అరిచ్చెందురుడి తాత పుట్టింది చీకట్లో-

అరిచ్చెందురిడి ఒంట్లో చీకటి- ఒంటి మీదా చీకటి. కానీ వాడి కళ్ళకెదురుగా కిటికీల్లోమటుకు వెలుగు...వెలుగు!!

అరిచ్చెందురిడి పక్కన, చీకట్లో చీకటి లాంటి ముతగుడ్డల్లో వాడి తల్లి చుట్ట చుట్టేసిన చుట్టలా, అస్తవ్యస్తంగా వుంది. అరిచ్చెందురిడిని వాడితల్లి ఎన్నో సమయాల్లో గుండెల్లో దాచుకుంది. అక్కడా చీకటే।

సూర్యుణ్ని మరీమరీ చూస్తే వెలుగు కనిపించనట్టు చీకటిని చూసి చూసి అరిచ్చెందురిడికిప్పుడు చీకటి కనిపించడం లేదు.

అరిచ్చెందురుడికి తల్లంటే ప్రేమ!

తల్లిని బాగా చూసుకోవాలనీ, కష్టపడి కూలీపనయినా సంపాదించి రోజుకోపూటయినా తిండి పెడ్దామనీ బుద్దెరిగినప్పటి నించీ ఎన్నిసార్లో అనుకున్నాడు. ఇప్పుడూ అనుకుంటున్నాడు. కానీ మార్గం లేదు. చుట్టూతా చీకటి.

మీరూ మీ పరివారం

ప్రజాతంత్ర

చదవండి వారం వారం

తనకోసం కాకపోయినా- తల్లి కోసమయినా తన బతుకులోకి వెలుగుని తెద్దామని ప్రయత్నం. ఎన్ని ప్రయత్నాలో...! కాని, ఇంతవరకూ...

ఇప్పుడు తప్పదు! తల్లి చుట్టూతా వెలుగు!

తెల్లారింది.

అయినా అరిచ్చెందురుడి చుట్టూ చీకటే!!

అరిచ్చెందురుడు వీధి దీపం క్రిందనించి కదల్లేదు. వాడి తల్లీ కదల్లేదు.

మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు ఆ సందులోకి మున్సిపాలిటీవారి వ్యానొచ్చింది. అల్లంతదూరంలోనే వ్యానుని చూసి అరిచ్చెందురుడు లేచి తల్లికి కాస్త దూరంగా జరిగాడు.

* * *

వ్యాన్ దిగినవాళ్ళల్లో ఆఫీసరులాంటివాడు ముందుగా అరిచ్చెందురిడి దగ్గరగా వొచ్చేడు. వొచ్చి, వాడి తల్లి మొహంమీది గుడ్డ తొలగించేడు.

తొలగించి, "ఇది చచ్చింది" అన్నాడు.

అరిచ్చెందురుడు- "ఆహా అలాగా" అన్నాడు.

"నీకేమవుద్ది?"

"నాకేమవదు"

"ఎప్పట్నుంచిలా పడుందీ?"

"రాత్రినించీ. ఈగలు ముసరకుండా నా బట్ట కప్పాను."

అయిదు నిమిషాల్లో అరిచ్చెందురుడి తల్లి వ్యానెక్కింది.

ఆఫీసు ఫార్మాలిటీస్ తర్వాత అరిచ్చెందురుడి తల్లి కాలుతుంది. వెలుగుతుంది.

అరిచ్చెందురుడు అక్కణ్ణుంచి కదల్లేదు. ఇంకా చీకట్లోనే వున్నాడు. *